# మహేశ్ బ్యాంక్ చైర్మన్, డైరెక్టర్‌పై కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏపీ మహేశ్ కో– ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్, ఎండీలపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. హిమాయత్‌నగర్‌కు చెందిన ఓంప్రకాశ్ మోదాని కోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంకు చైర్మన్‌గా రామ్ ప్రకాశ్ బంగ్, ఎండీగా వీరేందర్ ఖండేల్‌వాల్ కొనసాగుతున్నారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బోర్డు ఆఫ్ డైరెక్టర్ బ్యాంకు కార్యకలాపాలను రోజు వారీగా పరిశీలిస్తూ, బ్యాంక్ కస్టమర్లతో కూడా సమావేశం కావచ్చుని, ఎండీకి రూ. 30 లక్షల అత్యధిక రుణం మంజూరు చేసే అర్హత మాత్రమే ఉంటుందని బాధితుడు తెలిపారు. దీంతో పాటు 2022, జనవరి నెలలో ఆర్‌బీఐ తనిఖీలు కూడా మహేశ్ బ్యాంకులో జరిగాయన్నారు. అయితే, చైర్మన్, ఎండీలు డిసెంబర్, 2022 నుంచి ప్రతిరోజు బంజారాహిల్స్‌లోని బ్యాంకు ప్రధాన కార్యాలయానికి వెళ్తున్నారని, గతంలో రుణాలు తీసుకొని ఎన్‌పీఏ (నాన్ ఫర్‌ఫామింగ్ అస్సెట్స్)గా మారిన వారికి రుణాలు రెన్యూవల్ చేస్తూ 10 శాతం కమీషన్ తీసుకుంటున్నారని, సుమారు రూ. 90 కోట్ల రుణాలు రెన్యువల్ చేశారని ఆరోపించారు. ఇలా బ్యాంకుకు నష్టం చేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, పూర్తి వివరాలు బయటకు తీయాలంటూ బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, న్యాయస్థానం ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మాయమైన పక్షి ఆచూకీ వాట్సాప్ స్టేటస్ ద్వారా లభ్యం

బంజారాహిల్స్, అక్టోబర్ 2: అల్లారు ముద్దుగా పెంచుకున్న పక్షి తప్పిపోయింది. యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు వాట్సాప్ స్టేటస్ ఆధారంగా పక్షిని పట్టుకుని యజమానికి అప్పగించారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 44లోని ఓ కాఫీషాపు యజమాని నరేందర్ చారి ఆస్ట్రేలియా నుంచి ఇటీవల గాలా జాతికి చెందిన చిలుకను తెప్పించుకున్నాడు. ఆ పక్షికి మైరూ అని పేరుపెట్టుకుని పెంచుకుంటున్నాడు. రూ.1.30 లక్షల వ్యయంతో విదేశాల నుంచి తెప్పించుకున్న ఎక్సోటిక్ పక్షి మూడురోజుల కిందట మాయమైంది. దీంతో బాధితుడు నరేందర్ చారి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేకంగా విదేశాల నుంచి తెప్పించే పక్షులను విక్రయించే పెట్‌షాపులకు, డీలర్లకు సమాచారం ఇచ్చారు. పక్షి కాలికి ఉన్న రింగ్‌లో ప్రత్యేకమైన కోడ్ ఉంటుందని, కోడ్ ద్వారా అది ఎక్కడి నుంచి తెప్పించారనే వివరాలు ఉంటాయని కూడా తెలిసింది. ఇదిలా ఉండగా, ఎర్రగడ్డకు చెందిన సయ్యద్ ముజాహిద్ అనే వ్యక్తి అరుదైన పక్షిని అమ్ముతానని పేర్కొంటూ తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. ఆసక్తి ఉన్న వారు తనను సంప్రదించాలని సూచించారు. ఈ స్టేటస్‌ను చూసిన పెట్‌షాప్ నిర్వాహకులు జూబ్లీహిల్స్ ఎస్ఐ రాకేశ్‌కు సమాచారమిచ్చారు. దీంతో ముజాహిద్‌ను సంప్రదించగా.. తనకు ఎర్రగడ్డలో ఓ వ్యక్తి ఈ పక్షిని రూ. 50వేలకు విక్రయించాడని, నేను రూ.70వేలకు విక్రయిస్తానని చెప్పాడు. దీంతో జరిగిన విషయాన్ని అతడికి చెప్పిన పోలీసులు.. పక్షిని స్వాధీనం చేసుకుని యజమాని నరేందర్ చారికి అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులకు పక్షి యజమాని కృతజ్ఞతలు తెలిపాడు.

# లూలూ మాల్ వద్ద ట్రాఫిక్ సమస్యలకు చెక్

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): లూలూ మాల్ వద్ద ట్రాఫిక్‌కు ఏర్పడిన అంతరాయం పునరావృతం కాకుండా కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో వాహనదారులు మలేషియా టౌన్‌షిప్ నుంచే జేఎన్‌టీయూ వైపు వచ్చి ఫ్లైఓవర్ ప్రారంభంలో కుడివైపు వెళ్లే ప్రయత్నం చేశారు. నాలుగు లేన్లలో వచ్చిన వాహనాలు ఒక్కసారిగా లూలూ మాల్‌కు వెళ్లేందుకు కుడివైపు మలుపు తీసుకునే ప్రయత్నం చేయడంతో.. వెనకాల ఉన్న వాహనాలకు ఆటంకం ఏర్పడి ఒక్కసారిగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం జరిగిన ఈ ఉదంతం పునరావృతం కాకుండా సోమవారం కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచే రంగంలోకి దిగారు. మలేషియా టౌన్‌షిప్ నుంచి వచ్చే వాహనాలు లూలూ మాల్ వెళ్లేందుకు ఫ్లైఓవర్ ప్రారంభంలో ఉన్న కుడివైపు యూ టర్న్ తీసుకోకుండా.. 100 మీటర్ల దూరంలోనే యూటర్న్‌ను ఏర్పాటు చేసినట్లు కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.నగేశ్ తెలిపారు. దీనివల్ల ఎడమవైపు వెళ్లే వాహనాలకు, నేరుగా ముందు వైపు వెళ్లే వాహనాలకు లైన్ క్లియర్ కావడమే కాకుండా లూలూ మాల్ వైపు వెళ్లే వాహనాలు సైతం సులువుగా కుడివైపు యూటర్న్ తీసుకుని వెళ్లేలా ఏర్పాటు చేశామని తెలిపారు. అంతే కాకుండా.. ఎక్కడ కూడా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఈ మార్గంలో 10 నుంచి 15 మంది ట్రాఫిక్ పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా అడ్డదిడ్డంగా పార్క్ చేసే వాహనాలను తొలిగించేందుకు నాలుగు టోయింగ్ వాహనాలను ఏర్పాటు చేసి, జరిమానాలు విధించినట్లు ఇన్‌స్పెక్టర్ నగేశ్ వెల్లడించారు. సాధారణ ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.

# 4న కేబుల్ బ్రిడ్జి పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైక్లింగ్ టు ఓట్, వాకథాన్ అవగాహన కార్యక్రమాల దృష్ట్యా ఈ నెల 4న దుర్గం చెరువు, కేబుల్‌బ్రిడ్జి పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ వెల్లడించారు. బుధవారం తెల్లవారు జాము 5.30గంటల నుంచి ఉదయం 8.30గంటల వరకు కేబుల్ బ్రిడ్జి, దాని పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా కేబుల్‌బ్రిడ్జి, సీఓడీ జంక్షన్, కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లే ఐటీసీ కొహినూర్ వెనక వైపు రోడ్డు, మైహోం అబ్రా, టీ–హబ్ నుంచి సీ– గేట్ వెళ్లే మార్గం, ఐకియా రోటరీ నుంచి కేబుల బ్రిడ్జి వెళ్లే మార్గాలను పూర్తిగా ఉదయం 5.30 గంటల నుంచి 8.30గంటల వరకు 3 గంటల పాటు మూసివేస్తున్నట్లు వెల్లడించారు.


**దారి మళ్లింపు మార్గాలు:**

- రోడ్‌నం.45 నుంచి కేబుల్ బ్రిడ్జి మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాలను కావూరి హిల్స్ వద్ద దారి మళ్లించి, మాదాపూర్ పీఎస్, సీఓడీ జంక్షన్, సైబర్‌టవర్స్ మీదుగా అనుమతిస్తారు.
- బయోడైవర్సిటీ నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లే వాహనాలను సైబర్‌టవర్స్ మీదుగా దారి మళ్లించి, సీఓడీ, రోడ్.నం.45 మీదుగా దారి మళ్లిస్తారు.
- మీనాక్షి జంక్షన్ నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లాల్సిన వాహనాలను ఐకియా రోటరీ మీదుగా దారి మళ్లించి సైబర్‌టవర్స్, సీఓడీ, రోడ్ నం.45మీదుగా అనుమతిస్తారు.

# అల్లరి

ALLARI

**పెద్దల మాట**




**నూనె** వేస్తూ ఉంటేనే దీపం వెలుగుతుంది. మనం ప్రేమ చూపిస్తుంటేనే.. మనపైన ప్రేమ అనే ప్రకాశం పడుతుంది.

• మదర్ థెరిస్సా

**తెలుసుకుందాం**


1. విద్యుదయస్కాంతం తయారీకి దేన్ని వాడతారు? • మెత్తని ఇనుము
2. 'మోదుగుపూలు' నవలను ఎవరు రచించారు? • దాశరథి రంగాచార్య
3. ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం ఏది? • గ్రీన్ ల్యాండ్



**కింది** పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Nothing

Ex : Thin



## సమయం విలువ

**కథ**

**పూర్వం** హరి – గిరి అనే ఇద్దరు దోస్తులు ఉండేవాళ్లు. హరి రాజభవనంలో ఖజానాను చూసుకొనే ఉద్యోగం చేస్తుండేవాడు. గిరి మాత్రం ఏ పనీ చేయకుండా, సోమరిగా తిరిగేవాడు. ఒకరోజు గిరితో.. ''ఏదైనా పని చేసుకోవచ్చు కదా! ఊరికే ఇలా ఉంటే ఎలా?'' అని సలహా ఇచ్చాడు హరి. దానికి గిరి.. ''నాకు ఎవరూ పని ఇవ్వడం లేదు. ఎందుకంటే నేనంటే పడనివాళ్లు.. నేను చాలా బద్ధకస్తున్నని నాపై తప్పుడు ప్రచారం చేశారు!'' అని బదులిచ్చాడు. అప్పుడు హరి.. ''నేను ఎలాగూ ఖజానా చూసుకునే ఉద్యోగమే చేస్తున్నాను కదా! అక్కడి ధనాగారంలోని డబ్బును లెక్కపెట్టడానికి నీతిమంతులైన ఉద్యోగులు కావాలి. నువ్వు రేపు ఉదయాన్నే రాజ భవనానికి రా! పనికి తగ్గ ఫలితం ఉంటుంది!'' అని చెప్పాడు. గిరి ఇంటికి వెళ్లి తన భార్యతో విషయం చెప్పాడు. వెంటనే ఆమె కూడా.. ''ధనాగారంలో పని అంటే.. ఎంతో గౌరవం! నువ్వు రేపు ఉదయాన్నే వెళ్లి పనిలో చేరు!'' అని చెప్పింది.

తెల్లవారి ఆలస్యంగా నిద్రలేచాడు హరి. ఉద్యోగానికి వెళ్లాలని భార్య తొందరపెట్టినా.. హరి ఏమాత్రం పట్టించుకోలేదు. ''ఇప్పుడే ఎందుకు తొందర? ధనాగారం తెరవడానికి చాలా సమయం పడుతుంది. నేను భోజనం చేసి వెళ్తా! ముందైతే నాకు అన్నం పెట్టు!'' అన్నాడు. కడుపునిండా తిని, ఇంట్లోనే ఓ గంటసేపు విశ్రాంతి తీసుకున్నాడు. తర్వాత నెమ్మదిగా లేచేసరికి మధ్యాహ్నం అయింది. ఆదరాబాదరాగా రాజ భవనానికి బయల్దేరాడు. అది ఎండకాలం. దాంతో నడక వల్ల తీవ్రంగా అలసిపోయి.. మార్గమధ్యలో చెట్టు కింద ఆగి విశ్రాంతి తీసుకున్నాడు. అలసిపోయి ఉండటంతో.. వెంటనే కన్ను అంటుకుంది. నిద్ర లేచేసరికి పొద్దు వాలుతున్నట్లు గుర్తించాడు. హడావుడిగా లేచి.. మళ్లీ నడక మొదలుపెట్టాడు. తాను రాజభవనానికి చేరుకునే సరికే.. చీకటి పడే వేళయ్యింది. అప్పటికే ధనాగారంలో పనిచేసేవాళ్లంతా వెళ్లిపోయారు. హరి కూడా గిరి కోసం ఎదురు చూసీచూసీ, ధనాగారానికి తాళం వేసి వెళ్లిపోయాడు. గిరి వచ్చేసరికి మూసి ఉన్న ధనాగారం తలుపుల దగ్గర భటులు కావలి కాస్తూ కనిపించారు. దాంతో చేసేది లేక చింతిస్తూ.. ఇంటి దారిపట్టాడు. తన సోమరితనం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని బాధపడ్డాడు. సమయం విలువైందని గ్రహించకుండా దోస్తు ఇచ్చిన అవకాశాన్ని కోల్పోయాడు.

• కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి



జవాబులు

పూరించండి : BICYCLE, BAG



**టంగ్ ట్విస్టర్స్**

Green glass globes glow greenly.

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com

**పూరించండి**

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి




**లిటిల్ హ్యాండ్స్**

ఎ. వల్లభ్, సిద్దిపేట

